

పూల స్టాల్ వద్ద వినియోదారులు



పత్రి, పూజా సామగ్రి విక్రయాలు



మార్కెట్లకు చవితి శోభ

- జోరుగా పూలు, పళ్ల విక్రయాలు
- సందడిగా మారిన కూడళ్లు

ఆరిలోవ : వినాయక చవితి పూజకు వేళయింది. గణనాథుని పూజించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. పూజా సామగ్రి విక్రయాలతో బజార్లు సందడిగా మారాయి. సాధారణంగానే ఆదివారం పూట రద్దీగా ఉండే ఎంవీపీ రైతు బజార్ వినాయక చవితి నేపథ్యంలో మరింత రద్దీగా మారింది. రోజువారీ సామగ్రితో పాటు పూజా సామగ్రి కూడా కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులతో మార్కెట్ కిక్కిరిసిపోయింది. వాహనాలు బారులుతీరాయి. వ్యాపారులు వివిధ రకాల పూలు రాసులుగా పోసి విక్రయించారు. పూజకు అవరమైన పత్రి, అరటి ఆకులు, అరటి మొక్కలు, వెలగకాయలు, జామ, నారింజ, జొన్న పొత్తులు, కొబ్బరి పువ్వు, చెరకు, అరటి పళ్లు, ద్రాక్ష, యాపిల్ విక్రయాలు జరిగాయి. పండగ కావటంతో సామగ్రి ధరలు కొండెక్కాయి. అదే విధంగా వ్యాపారులు చామంతి, గులాబీ, బంతి తదితర పూలు రాసులుగా పోసి విక్రయించారు. బయటి మార్కెట్లలో కూడా వినాయక చవితి పూజా సామగ్రి విక్రయాలు జరిగాయి. ఆరిలోవలోని బాలాజీనగర్, టి.ఐ.సి. పాయింట్, అంబేడ్కర్ జంక్షన్, రవీంద్రనగర్, తోటగరువు, ఆదర్శనగర్, విశాలాక్షినగర్ బజార్లలో పూజా సామగ్రి, పళ్లు, పూలతో పాటు వినాయక ప్రతిమల విక్రయాలు జరిగాయి. వినియోగదారుల తాకిడితో అన్ని ప్రాంతాలు రద్దీగా మారాయి.



ఎంవీపీ రైతు బజార్‌లో వినియోగదారుల రద్దీ



బెల్లం విక్రయ స్టాల్ వద్ద..

నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు



సంపత్ వినాయగర్ ఆలయం వద్ద ట్రాఫిక్ పోలీస్

సీతమ్మధార : ఆశీలమెట్టలోని శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయంలో సోమవారం నుంచి వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశా రు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యేక పూలతో స్వామి వారిని అలంకరించారు. సోమవారం ఉదయం 4 గంటలకు గణపతి హోమంతో వేడుకలు ప్రారంభిస్తారు.

చోరీ సొత్తు స్వాధీనం

బీచ్‌రోడ్డు : వారం రోజుల కిందట చోరీకి గురైన సొత్తును ఆదివారం ఈస్ట్ క్రైమ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సిరిపురంలోని సీషెల్ గేటెడ్ కమ్యూనిటీలో నివసిస్తున్న ఒక వృద్ధురాలు వారం రోజుల కిందట తన ఇంట్లో బంగారం కనిపించటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన క్రైమ్ పోలీసులు వృద్ధురాలి వద్ద పని చేస్తున్న కృష్ణవేణిని పలు కోణాల్లో విచారించారు. దాంతో తానే ఇద్దరు వ్యక్తులతో దొంగతనం చేయించినట్లు ఒప్పుకుంది. పోలీసులు వారి వద్ద నుంచి చోరీకి గురైన సొత్తు మొత్తం స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారు. అతి తక్కువ సమయంలో కేసును ఛేదించిన ఈస్ట్ క్రైమ్ సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ అభినందించారు.

క్లుప్తంగా

సూర్యభగవానుడికి పూజలు



సూర్యభగవానుడి సన్నిధిలో పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ వద్ద సూర్యభగవానుడి ఆయంలో ఆదివారం భక్తుల తాకిడి నెలకొంది. సింహాచలం దేవస్థానం నిర్మించిన ఈ ఆలయంలో సూర్యభగవానుడిని రోజూ భక్తులు దర్శించుకుంటున్నారు. ఆదివారం మరింత ఎక్కువ సంఖ్యలో దర్శించుకుని పూజలు చేస్తున్నారు. అటు సింహాచలం, అడవివరం, దారపాలెం, పైనాపిల్ కాలనీ.. ఇటు శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఆరిలోవ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తుల స్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా సింహాచలం దేవస్థానం సిబ్బంది ఇక్కడకు వచ్చే భక్తులకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు.

శాంతి దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయబాబు, నరవ ప్రకాశరావు తదితరులు

మద్దిలపాలెం : అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని ప్రతి ఏడాది సెప్టెంబర్ 21వ తేదీన జరుపుకుంటారు. ఈ ఏడాది కూడా ఘనంగా ఉత్సవం నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన శాంతి దినోత్సవ పోస్టర్‌ను కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గొప్ప కార్యక్రమాన్ని ఐఏఆర్‌ఎఫ్ నిర్వహించనుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఆర్‌ఎఫ్ చైర్మన్ నరవ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్యుప్రెషర్ చికిత్సా విధానంలో ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న మాధవ్

మద్దిలపాలెం: ఆక్యుప్రెషర్ చికిత్సా విధానం ఎంతో ఉపయోగకరమని, ఆ విధానంలో ఉచిత శిక్షణ ఇవ్వడం ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. పీతాపురం కాలనీలో వారం రోజులుగా లాలానాయక్ ట్రస్ట్ 30 మందికి ఉచితంగా శిక్షణ అందించింది. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ ఎంతో ఖర్చుతో కూడిన ఈ శిక్షణను ఉచితంగా ఇవ్వడానికి ముందుకు వచ్చిన లాల్ నాయక్ ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు.

ఏయూ ఈయూ నూతన కార్యవర్గం



కొత్త కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న డైరెక్టర్లు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగుల సహకార సంఘం(ఏయూఈయూ) నూతన కార్యవర్గం ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా ఆచార్య వి.సిద్ధయ్య, కార్యదర్శిగా షేక్ ఖాదర్ బాబా, ఉపాధ్యక్షుడిగా సిహెచ్.లక్ష్మణ బాబు, సంయుక్త కార్యదర్శిగా కె.సోమేశ్వర రావు, కోశాధికారిగా డాక్టర్ ఎస్.ఎం.యుగంధర్ ఎన్నికయ్యారు. వీరిని ఇతర డైరెక్టర్లు అభినందించారు. గతంలో ఎన్నికైన కార్యవర్గం ఏడాది కాలం పూర్తిచేసుకుని కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంది.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



ఎంవీపీ రైతుబజార్‌లో మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు



ఎంవీపీ ఆదర్శనగర్‌లో మట్టి ప్రతిమలు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

ఆరిలోవ: వినాయక చవితి సందర్భంగా పలు సంస్థలు, స్వచ్ఛంద సంఘాలు, కాలనీల అసోసియేషన్లు మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమాలు రెండు రోజులుగా చేపడుతున్నాయి. ఇందులో భాగంగా ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం ఎంవీపీ రైతుబజార్‌లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. సుమారు 1000 విగ్రహాలను వినియోగదారులు, రైతులకు అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి ప్రతిమలు వినియోగించడం శ్రేయస్కరమని, అందుకే వీటిని పంపిణీ చేశామని బోర్డు ఏఈ ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో జి.ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది రామకృష్ణ, గురునాథ్‌రెడ్డి, హిమకాంత్, రైతు బజార్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో..

ఎంవీపీకాలనీ: హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ ఆదర్శనగర్ కాలనీలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. నగరవాసులు పర్యావరణ హితంగా వినాయక చవితి జరుపుకోవాలనే లక్ష్యంతో మట్టి ప్రతిమలు, వ్రత పుస్తకాలను ఉచితంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు గంగ రాము, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు



రవీంద్రగనర్ ఆలయంలో పూజలు చేస్తున్న అక్కరమాని వెంకటరావు, భక్తులు



పెదవాల్తేర్‌లో విశ్వకర్మను దర్శించుకుంటున్న అక్కరమాని వెంకటరావు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో పలు చోట్ల విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. 10వ వార్డు రవీంద్రనగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు స్వామిని దర్శించుకొని పూజలు, అభిషేకాలు చేశారు. చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయ సముదాయంలోని వీరబ్రహ్మం స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఇక్కడ అన్నసమారాధన చేపట్టారు.

విశ్వకర్మకు పూజలు

ఏయూక్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేర్ గాంధీ సెంటర్ కూడలిలో శ్రీ కామాక్షమ్మ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు విశ్వకర్మను దర్శించి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరియార్ ఆలోచనలు అనుసరణీయం


బీచ్‌రోడ్డు: నేటి సమాజానికి పెరియార్ ఇ.వి.రామస్వామి ఆలోచనలు ఎంతో అవసరమని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకుడు టి.శ్రీరామమూర్తి అన్నారు. పెరియార్ 145వ జయంతి సందర్భంగా ఆదివారం బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా, మహిళలకు పురుషులతో సమానంగా హక్కులు ఇవ్వాలని, అణగారిన వర్గాలకు అగ్రవర్ణాలతో సమానంగా జీవించే అవకాశం ఇవ్వాలని పెరియార్ చేసిన పోరాటాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు మురళీ, రవి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



పెరియార్ రామస్వామి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాస్తిక సమాజం సభ్యులు

సేఫ్టీ కోర్సులతో ఉపాధి అవకాశాలు

మురళీనగర్: సేఫ్టీ కోర్సులతో అనేక ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. ఇంజినీరింగ్ కాలేజీలో కెమికల్ సేఫ్టీ సూపర్‌వైజర్ ప్రొగ్రాంలో భాగంగా ఆదివారం ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సుల్లో పరిశ్రమల్లో పనిచేస్తున్న వారు కూడా చేరవచ్చన్నారు. పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాలు, వాటి నివారణ మార్గాలు, అగ్ని ప్రమాదాల నియంత్రణ, రసాయన పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సి చర్యలు వంటి అంశాలపై శ్రీహరికోట ఇస్రోలో సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేసిన ఎ.వరహాలు ఎస్‌బీటీఈటీ మార్గనిర్దేశాలను అనుసరించి రూపొందించిన పాఠ్యపుస్తకాలను ప్రిన్సిపాల్ వెంకటరమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కెమికల్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, అధ్యాపకులు సిహెచ్.ఎస్.ప్రసాద్, తులసీరావు, సూకరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



సేఫ్టీ కోర్సుల పాఠ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

ఎర్నిమాంబకు విశేష పూజలు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ విశేష పూజలు చేశారు.

సాంకేతిక విద్యార్థులకు చేరువగా..

- ఏయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రంథాలయానికి విశేష ఆదరణ
- ప్రత్యేకంగా డిజిటల్ లైబ్రరీ సదుపాయం
- అందుబాటులో రీడింగ్ రూమ్



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల గ్రంథాలయం



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు గ్రంథాలయం పూర్తిస్థాయిలో సేవలు అందిస్తోంది. ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ఈ లైబ్రరీని నెలకొల్పారు. త్వరలోనే ఈ గ్రంథాలయానికి మరిన్ని ఆధునిక సొబగులు సైతం అద్దడానికి అధికారులు సిద్ధమయ్యారు.

64 వేల పుస్తకాల సమాహారం

ప్రస్తుతం గ్రంథాలయంలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా 64 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ఐఈఈఈ జర్నల్స్‌ను దాదాపు రూ.43 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసి అందుబాటులో ఉంచారు. డెల్‌నెట్‌తో 1500 ఈ పుస్తకాలు సైతం విద్యార్థులు వినియోగించుకోవడానికి ఉన్నాయి. విద్యార్థులు చదువుకోవడానికి ఉపయుక్తంగా ప్రత్యేకంగా వార్తా పత్రికలు సైతం ఇక్కడ అందుబాటులో ఉంచుతున్నారు. సాంకేతిక జ్ఞానంతోపాటు వర్తమాన విశేషాలను తెలుసుకుంటూ, ఆంగ్ల భాష ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవడానికి వార్తాపత్రికలు ఉపయుక్తంగా నిలుస్తున్నాయి.

డిజిటల్ లైబ్రరీ.. రీడింగ్ రూమ్

మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఆధునిక వసతుల కల్పనలో ఏయూ ముందుంటోంది. దీనిలో భాగంగా గ్రంథాలయంలో ఆధునిక డిజిటల్ లైబ్రరీ సదుపాయం కల్పించారు. ఇక్కడ 50కి పైగా కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఐఈఈఈ జర్నల్స్, ఈ పుస్తకాలు చదువుకునే అవకాశం కల్పించారు. విద్యార్థులు తమ ప్రాజెక్ట్ వర్క్‌లను చేయడానికి డిజిటల్ లైబ్రరీ, ఈ జర్నల్స్ ఎంతో సహాయకారిగా నిలుస్తున్నాయి. గ్రంథాలయం క్రింది అంతస్తులో ప్రత్యేకంగా ఒక రీడింగ్ రూమ్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఇక్కడ విద్యార్థులు చదువుకోవడానికి అనువైన పరిస్థితులు కల్పించారు. స్టూడెంట్లు తమ ల్యాప్‌ట్యాప్‌లతో సైతం ఇక్కడ కూర్చుని పనిచేసుకునే అవకాశం ఉంది.

ఉదయం 9 గంటల నుంచి..

విద్యార్థులకు పూర్తిస్థాయిలో సేవలు అందించే విధంగా గ్రంథాలయం పనిచేస్తోంది. రాత్రి 8 గంటల వరకు విద్యార్థులకు ఈ గ్రంథాలయం అందుబాటులో ఉంచుతున్నారు. మూడు షిఫ్టులుగా ఉద్యోగులు ఇక్కడ సేవలు అందిస్తున్నారు. భారతీయ విద్యార్థులతోపాటు విదేశీ విద్యార్థులు సైతం గ్రంథాలయాన్ని వినియోగించుకోవడం జరుగుతోంది.



డిజిటల్ లైబ్రరీ

వార్తా పత్రికలు ఉపయుక్తం



నిత్యం ఆంగ్ల వార్తాపత్రికల్లో వచ్చే ఎడిటోరియల్ పేజీని తప్పనిసరిగా చదువుతారు. డిజిటల్ లైబ్రరీని ఉపయోగించుకుంటే మాక్‌టెస్టులకు ప్రిపరేషన్ సాధ్యపడుతోంది. పుస్తకాలు రిఫర్ చేయడానికి అవసరమైన విధంగా అందుబాటులో ఉంచారు.

– సిహెచ్.అవంత్ కుమార్, మెటలర్జీ, చివరి సంవత్సరం విద్యార్థి

అనువైన పరిస్థితులు



విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవడానికి అనువైన అన్ని పరిస్థితులు ఇక్కడ ఉన్నాయి. విభిన్న పుస్తకాలు రిఫరెన్స్‌గా మాకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయి. రీడింగ్ రూమ్ కూడా చదువుకోవడానికి ఏర్పాటు చేశారు. సంతృప్తికరమైన సేవలు సిబ్బంది అందిస్తున్నారు.

–జి.ఆర్.ప్రసన్న, ఎంసీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థిని

ఉపయుక్తంగా డిజిటల్ లైబ్రరీ



డిజిటల్ లైబ్రరీని విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోంది. ఇంజినీరింగ్ విద్యార్థులకు వివిధ ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఈ ప్రక్రియలో వీరికి ఇక్కడ అందుబాటులో ఉన్న ఐఈఈఈ జర్నల్స్ రిఫర్ చేసుకుని శాస్త్రీయ పరిశోధనలో నూతన అంశాలను తెలుసుకునే అవకాశం కలుగుతోంది. ఎంతో క్రమశిక్షణతో విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

– డాక్టర్ కె.అరుణ, లైబ్రరీ అసిస్టెంట్

విద్యార్థులకు మరిన్ని వసతులు



త్వరలో గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. అధికారులు దీనికి సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేశారు. త్వరలో పూర్తి స్థాయిలో గ్రంథాలయాన్ని ఆధునీకీకరించి, విద్యార్థులకు మరింత చేరువ చేసే ప్రయత్నం జరుగుతోంది.

– ఆచార్య పి.వెంకటేశ్వర్లు, గ్రంథాలయాధికారి

ఉత్సాహంగా ర్యాంప్ వాక్



ర్యాంప్‌పై మాట్లాడుతున్న గృహిణి

ఎంవీపీకాలనీ: నగరంలో తొలిసారి నిర్వహించిన గ్లామ్ ఫ్యాషన్ వీక్ ఉత్సాహంగా జరిగింది. లాసన్స్ బేకాలనీలోని క్యూబా బంక్వట్‌లో గ్లామ్ ఫ్యాషన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఫ్యాషన్ వీక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక డిజైన్లతో కూడిన వస్త్రాలు ధరించి మోడల్స్ ర్యాంప్ వాక్ చేశారు. యువతులు, గృహిణుల కేటగిరీలో ఫ్యాషన్ షో జరగ్గా.. నగరానికి చెందిన ఔత్సాహిక మోడళ్లు పాల్గొని అలరించారు. బిగ్‌బాస్ ఫేమ్ రాజ్, వాసంతిలు ఈ షోకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

రౌడీషీటర్లు నేర ప్రవృత్తి విడిచిపెట్టాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ త్రినాథ్

బీచ్‌రోడ్డు: నగరంలోని రౌడీషీటర్లు నేర ప్రవృత్తి విడిచిపెట్టాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ హెచ్చరించారు. ఆదివారం నగరంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నడవడిక కలిగిన వారి రౌడీషీట్లు క్లోజ్ చేసేందుకు కృషి చేస్తామన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరు కాని వారికి, నేరాలకు పాల్పడే వారి కోసం ప్రత్యేక బృందాలు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక చవితి సందర్భంగా ఎటువంటి దందాలకు పాల్పడరాదన్నారు. ప్రజల దగ్గర దౌర్జన్యంగా చందాలు తీసుకోవటం గాని, వినాయక మండపాల వద్ద గొడవలు సృష్టించటం కానీ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.